క్లుప్తంగా

జగనన్న సురక్ష ఓ వరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

నాగలాపురం: ఆరోగ్య సురక్ష పేదలకు ఓ వరమని నాగలాపురం ఎంపీడీఓ పీఎంకే బాబు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో నాగలాపురం సచివాలయం–1 పరిధిలో ఆరోగ్య సురక్ష–2 శిబిరం నిర్వహించారు. డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ అరుణ్ కిషోర్‌తోపాటు తిరుపతి రుయా ఆసుపత్రి గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్, కంటి వైద్య నిపుణులు మొత్తం 311 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని తొలుత ఎంపీడీఓ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి నాగరత్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ వైష్ణవి, ఫీబా, అలైక్య, మేఘల, గాయత్రి, ఏఎన్ఎం భార్గవి, సౌజన్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సృజనాత్మకంగా విద్యాబోధన చేయండి



నోట్ బుక్స్ పరిశీలిస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యార్థులకు అన్ని సబ్జెక్టులపై మక్కువ, అభిరుచి పెంపొందించేలా సృజనాత్మకంగా విద్యాబోధన చేయాలని మండల విద్యాశాఖాధికారి మునిసుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కాటూరు గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించారు. తప్పులను సరిదిద్దారు. టీచర్లతో మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యాలను అనుగుణంగా పాఠాలు చెప్పాలని, వారిలో నిబిడీకృతమైన శక్తులను వెలికితీయాలన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన



గోడపై వెలసిన బీజేపీ పోస్టర్

శ్రీకాళహస్తి: పట్టణంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ జనసందోహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో, ఎస్‌బీఐ (దేవస్థానం శాఖ) వద్ద రాజకీయ ఎన్నికల గుర్తుతో కూడిన గోడ పత్రికలు ఉన్నాయి. ఇంకా కొన్ని ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్నట్లు సమాచారం. వీటిపై ఎన్నికల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

సత్యవేడు: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు స్వీప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించి ఎంపీడీఓ మాట్లాడారు. 80 ఏళ్లు పైబడి నడవలేని స్థితిలో ఉన్న వయోవృద్ధులు ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఎన్నికల సంఘం స్వీప్ అనే యాప్ ను రూపొందించిందన్నారు. వయోవృద్ధులు, వికలాంగులకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు ఉంటాయని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాన్నారు. పోస్టల్ బ్యాలెట్‌పై సోషల్ మీడియా నోడల్ అధికారి హరీష్ అవగాహన కల్పించారు. 80ఏళ్ల దాటిన వారు, వికలాంగులు, కోవిడ్ బాధితులకు సంబంధించి వారి ఇళ్లకు వెళ్లి 12–డి అప్లికేషన్ పూర్తి చేసి వారి ఓటును పోస్టు ద్వారా పంపిస్తున్నట్లు తెలిపారు.

ఊంజల్‌సేవలో పద్మావతీ అమ్మవారు



నారాయణవనం: టీటీడీ అనుబంధ పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పంగుణోత్తర ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం అమ్మవారు ఊంజల్‌సేవలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం సుప్రభాతసేవతో నిత్యపూజాకైంకర్యాలను, మూలవర్లకు శుక్రవార అభిషేకాలను పూర్తి చేసి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం నిత్య పూజలు పూర్తి అయిన తర్వాత అమ్మవారిని పట్టుపీతాంబరాలు, స్వర్ణాభరణాలను, సుగంధ పుష్ప మాలికలతో సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్టింప చేశారు. ఆలయ అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు ఊంజల్ మండలంలో ఊయలపై కొలువుదీరారు. దర్శించున్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నారాయణవనం: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి



పిచ్చాటూరులో జరిగిన బహిరంగ సభకు హాజరైన జనసందోహం, వరదయ్యపాళెం: మంత్రి సమక్షంలో పార్టీలో చేరుతున్న టీడీపీ నేతలు





టీడీపీ కనుమరుగవడం ఖాయం

- వైఎస్సార్ సీపీ గెలుపు బాధ్యత మీదే
- దౌర్జన్యాలకు భయపడొద్దు.. అండగా ఉంటా
- పొత్తు కుయుక్తుల చంద్రబాబును ప్రజలే నిలదీయాలి
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు



వరదయ్యపాళెం: భారీ ర్యాలీలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

నారాయణవనం/కేవీబీపురం (పిచ్చాటూరు)/పిచ్చాటూరు/నాగలాపురం/సత్యవేడు/వరదయ్యపాళెం/బుచ్చినాయుడుకండ్రిగ: సార్వత్రిక ఎన్నికల అనంతరం తెలుగుదేశం పార్టీ కనుమరుగవడం ఖాయమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జోస్యం చెప్పారు. శుక్రవారం నారాయణవనం, కేవీబీపురం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశాలు ర్యాలీలు, సభలు నిర్వహించారు. మంత్రి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.పెద్ది రెడ్డి మాట్లాడుతూ, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కృషి చేయాలని, తిరుపతి ఎంపీ అభ్యర్థి, సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. 2019లో బీజేపీని తిట్టి, ఎన్‌డీఏ కూటమికి గుడ్‌బై చెప్పి, కాంగ్రెస్‌తో జతకట్టిన చంద్రబాబు మళ్లీ ఏముఖం పెట్టుకుని బీజేపీతో పొత్తు పెట్టుకున్నారో ప్రజలు నిలదీయాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు నిర్ణయించిన వారికే పెన్షన్లు, రేషన్ కార్డులు, పక్కా ఇళ్లు దక్కేవని, అంతేకాకుండా 2014లో 600కు పైగా హామీలను ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిందే తడవుగా మ్యానిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించి, హామీలను అటకెక్కించారని దుయ్యబట్టారు. నిరుద్యోగ భృతి, బాబొస్తే.. జాబొస్తాదని యువత జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. పైగా టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డ ఆరు నెలలకే 2 లక్షల కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించి వారిని రోడ్డున పడేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మ్యానిఫెస్టోను ఒక భగవద్గీతగా, బైబిల్‌గా, ఖురాన్‌గా భావించి ఇచ్చిన హామీలన్నింటినీ 99 శాతం 58 నెలల పాలనలో నెరవేర్చారని అన్నారు. రాష్ట్రంలో ఓట్లు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకే మాత్రమే ఉందన్నారు. చంద్రబాబుకు అధికారం ఇస్తే ప్రజలను ఎంతగా వంచించాడో.. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అధికారం ఇస్తే ఎంతగా మేలు చేశారో ప్రజలే బేరీజు వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు ఇప్పుడు పొత్తులతో కూటమి కట్టి,, ఎన్నికల్లో మళ్లీ ప్రజలకు సూపర్6 పేరుతో ఆచరణ సాధ్యం కాని హామీలతో మరోసారి ప్రజలను వంచించేందుకు సిద్ధమయ్యాడని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టు ఐదేళ్లుగా నీటితో కళకళలాడుతుండడం సంతోషంగా ఉందన్నారు. ఇదంతా భగవంతుని ఆశీర్వాదమేనన్నారు. ప్రజల ఆశీర్వాదం కోరుతూ మళ్లీ మీ ముందుకువచ్చామన్నారు. సీఎం జగన్‌కు ప్రజలే బ్రాండ్ అంబాసిడర్లు, స్టార్ క్యాంపెయినర్లని అన్నారు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని రానున్న ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకుంటే కేంద్రం నుంచి నిధులు అధికంగా పొందే అవకాశం ఉంటుందన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా: రాజేష్

స్థానికంగా ఉంటూ సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ అన్నారు. వైఎస్ జగన్ హయాంలో జరిగిన అభివృద్ధి దేశంలో ఎక్కడా జరగలేదని ఆయన స్పష్టం చేశారు. పార్టీలో ప్రతి ఒక్కరినీ కలుపుకుపోతానని, తన విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు.

పేదల పక్షపాతి సీఎం జగనన్న : ఎంపీ

పేదల పక్షపాతి అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డీబీటీ ద్వారా రూ.2.54 లక్షల కోట్లను వివిధ సంక్షేమ పథకాల రూపేణా నేరుగా ప్రజల ఖాతాల్లో జమచేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని కోరారు.

ప్రత్యేక పూజల్లో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

నారాయణవనంలో తొలుత మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కల్యాణ ఆంజనేయస్వామి, అవధూత సారకాయలస్వామి ఆలయాలలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అభ్యర్థులందరూ గెలిచి వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావాలని మొక్కుకున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతల చేరిక

వరదయ్యపాళెం మండలంలోని పలువురు టీడీపీ నేతలు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పులివల్లంకు చెందిన చెంగయ్య, జీవయ్య, అంకయ్య, సుబ్రమణ్యం, పరంధామ్, కృష్ణయ్య, శంకర్, పరమయ్య, వెంకటరెడ్డికండ్రిగకు చెందిన కృష్ణమ నాయుడు, కుప్పట తాగేలికి చెందిన దయాకర్, మరికొందరు నేతలకు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యే సురాజ్, పార్టీ మండల కన్వీనర్లు సారకాయలు, చలపతిరాజు, గవర్ల కృష్ణయ్య, టి.అపరంజిరాజు, అరణి విద్యానాథరెడ్డి, నాయుడు దయాకర్‌రెడ్డి, ఎంపీపీలు దివాకర్‌రెడ్డి, ప్రతిమ, సింధు, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి, నియోజకవర్గ నాయకులు బుజ్జిరెడ్డి, జేబీఆర్ మునిరత్నం, తాడిపత్రి పరిశీలకుడు బీరేంద్రవర్మ, మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, మాజీ చైర్మన్ బుజ్జిరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు వంశీకృష్ణారెడ్డి, జిల్లా మహిళా సభ్యురాలు మస్తానీ, మాజీ ఎమ్మెల్యే సురాజ్, మాజీ ఎమ్మెల్సీ వై.శ్రీనివాసులు, సింగిల్‌విండో చైర్మన్ కేటీ హరిశ్చంద్రా రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, జెడ్పీటీసీ సభ్యులు విష్ణుప్రియ, టౌన్ సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ తొప్పయ్య, వైఎస్‌ఆర్‌టీయూసీ మండల అధ్యక్షులు మునిరాజ, మాజీ వైస్ ఎంపీపీ పాలపద్మనాభం, జెడ్పీటీసీ సభ్యురాలు మూర్తి మునెమ్మ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బొర్రా మాధవి, ముఖ్యనేతలు నందకుమార్, లాల్‌బాబుయాదవ్, మూర్తి సుబ్బన్న, శాస్త్రిరాజు, మణి, అయ్యప్ప, ఎస్ఎల్‌పురం రమణ, జిల్లా కార్మిక విభాగం అధ్యక్షులు బీరేంద్రవర్మ, జెడ్పీటీసీ సభ్యురాలు సభ్యురాలు సుమతి, మేజర్ పంచాయతి సర్పంచ్ చిన్నదొరై సుధా, మండల జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీష్ రెడ్డి, వైస్ ఎంపీపీ కుమారి, ఉప సర్పంచ్ సునీత, సోషియల్ మీడియా ప్రతినిధి ఈశ్వర్, అరణి సుధాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రాకేష్, సింగిల్‌విండో చైర్మన్ హరనాథరెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శులు జొన్నలగోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, గురునాథం, మణినాయుడు, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, వరదయ్యపాళెం మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ హరిబాబు రెడ్డి, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, జిల్లా కార్యవర్గ సభ్యుడు బందిల సురేష్, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, పలువురు నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.





వరదయ్యపాళెం: హాజరైన ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

మేలు చేసిన ప్రభుత్వాన్ని మర్చిపోవద్దు





ఏర్పేడు మండలం రాజుపాలెం, శ్రీకాళహస్తి మండలంలో ప్రచారం చేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: సంక్షేమ పథకాలతో గడప గడపకూ మేలు చేసిన ప్రభుత్వాన్ని మరవకుండా ప్రతి ఒక్కరూ ఆదరించాలని వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. మండలంలోని కందాడు పంచాయతీ పరిధి వెంకటాపురం, ఎస్సీ కాలనీ, రాజుపాలెం, ఎలకమిట్ట ఎస్టీ కాలనీలో శుక్రవారం సిద్ధం ఎన్నికల ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఇంటికీ నేరుగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ప్రజలకు చేసేంది ఏమీలేదన్నారు. రాష్ట్రంలో ఒక్క జగనన్ను ఎదుర్కొనేందుకు అన్ని పార్టీలు కలిసొస్తున్నాయని, అయినా ప్రజలు అండగా ఉండగా ఏమీ చేయలేవన్నారు. చంద్రబాబునాయుడు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ప్రజలు ఆయన్ను నమ్మే పరిస్థితుల్లో లేరని స్పష్టం చేశారు. గతంలో అనేక హామీలు ఇచ్చి వాటిని అమలుచేయలేదని గుర్తుచేశారు. సంక్షేమ యజ్ఞానికి శ్రీకారం చుట్టి పేదవారి కళ్లల్లో ఆనందం నింపిన జగనన్న మళ్లీ సీఎం అయితే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు శ్రీనివాసులు, జనార్దన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వీరరాఘవరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు నాగార్జున రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కందాటి ప్రభాకర్ రెడ్డి, రాంబత్తెయ్య, పారి నాగరాజు, మునెయ్య, కమలాకర్‌రెడ్డి, వెంకటేష్ యాదవ్, మల్లికార్జున్, జీపీ యాదవ్ లోకనాథరెడ్డి, సురేఖ, గుణశేఖర్ నాయుడు, గురునాథం, మునిరత్నం నాయుడు, యల్లయ్య, మణిరాజు, రమేష్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం

శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరిగినట్లు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. మండలంలోని పుల్లారెడ్డికండ్రిగలో శుక్రవారం ఆమె రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని గడపగడపకూ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పవిత్రారెడ్డి మాట్లాడుతూ ప్రజల వెంట ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారే నిజమైన నాయకులని చెప్పారు. కరోనా కష్టకాలంలో కొందరు నాయకులు ఎక్కడో పక్క రాష్ట్రంలో తలదాచుకుంటే ప్రజలకు అండగా నిలిచి ఆదుకున్న వ్యక్తి మన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాత్రమేనని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పలు ప్రభుత్వ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి ఏదో రకంగా లబ్ధి చేకూరేలా చూశారని తెలిపారు. అసలైన ప్రజాసేవకులైన బియ్యపు మధుసూదన్‌రెడ్డిని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ శుభ్రతపై అవగాహన అవసరం





ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఏర్పేడు: ప్రజలు పర్యావరణ శుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని తిరుపతి అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాల ప్రిన్సిపల్ నాదమునిరెడ్డి అన్నారు. మండలంలోని మర్రిమంద గ్రామంలో శుక్రవారం జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో పర్యావరణపై ర్యాలీ, అవగాహన, చెత్తా చెదారాలు, ముళ్లపొదల తొలగింపు, ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన వంద మందికి పైగా రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సమన్వయకర్త బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

ఏర్పేడు: రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండలంలోని పలుప్రాంతాల్లో శుక్రవారం కేంద్ర బలగాల కవాతు నిర్వహించారు. ఏర్పేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏర్పేడు, పాపానాయుడు పేట, వికృతమాల, గోవిందవరం, మునగలపాలెం గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

ఘనంగా చెంచమ్మ ఉత్సవాలు



శ్రీకాళహస్తి: మండలంలోని కల్లిపూడి గ్రామంలో వెలసిన చెంచమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దీనికి శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరై అమ్మవారికి పూజలు చేసుకున్నారు. ఆయనకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్లిపూడి గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దగ్ధమైన గడ్డివాము పరిశీలన

ఏర్పేడు: మండలంలోని నచ్చనేరిలో దగ్ధమైన గడ్డివామి సంఘటనా స్థలాన్ని శుక్రవారం ఎస్పీడీసీఎల్ అధికారులు పరిశీలించారు. నచ్చనేరికి చెందిన కైలాసం మునిరెడ్డి గడ్డివామి గురువారం అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఎస్పీడీసీఎల్ శ్రీకాళహస్తి డిప్యూటీ ఈఈ పరిశుద్ధరావు, ఏఈ వాసుదేవయ్య శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గడ్డివామి దగ్ధమై ఉంటుందన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు.

సిబ్బంది శిక్షణలో ఉన్నందుకే జాప్యం

శ్రీకాళహస్తి: మున్సిపాలిటీలోని దక్షిణ కైలాస ముక్తిధామం శ్మశాన వాటిక ప్రారంభించినా కార్యాచరణలోకి రాలేదని కొన్ని పచ్చపత్రికల్లో కథనాలు రావడంపై ఆలయ చైర్మన్ అంజూరుతారక శ్రీనివాసులు స్పందించారు. శ్రీకాళహస్తి శ్మశాన వాటిక (బర్నింగ్‌ప్లాంట్)లో పనిచేసే సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారని చెప్పారు. వారి శిక్షణ పూర్తయితే ఇక్కడ శ్మశాన వాటికలో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. మృతదేహాన్ని దహనం చేసే ఆపరేటింగ్ సిస్టంపై సిబ్బందికి తిరుపతిలో శిక్షణ ఇప్పిస్తున్నామని అధికారులు తెలిపినట్లు పేర్కొన్నారు. వారికి శిక్షణ పూర్తయిన తరువాత సుశిక్షితులైన వారి ఆధ్వర్యంలో దహన కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు.

అన్నదానంపై అసత్యరాతలు

శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో గతంలో సౌకర్యాల్లేక రోగులు చాలా ఇబ్బందులు పడేవారని గుర్తుచేశారు. ఇది గమనించిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆస్పత్రిని రూ.12 కోట్లతో అత్యాధునికంగా ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు. రోగులతోపాటు, సహాయకులు సైతం ఉండే విధంగా ప్రత్యేకమైన హాల్ ఏర్పాటు చేశారని చెప్పారు. ఆ రోగులకు, సహాయకులకు భోజన సదుపాయం లేకపోవడంతో ఆలయం నుంచి ప్రతి రోజు 150 మందికి భోజనం అందించాలని ఆలయ అధికారులను ఆయన అప్పట్లో ఆదేశించారని చెప్పారు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా భోజనం అందిస్తున్నామని తెలిపారు. అయితే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో పదిరోజుల పాటు భోజనం అందించలేకపోయామన్నారు. అయితే దాన్ని ఆసరాగా చేసుకుని, రోగులు భోజనం అందక ఇబ్బందులు పడుతున్నారంటూ కథనాలు ప్రచురించడం బాధాకరమని అన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రదోష పూజలు

నాగలాపురం: మండలంలో సురుటుపల్లెలోని శ్రీ సర్వ మంగళా సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం భక్తిప్రపత్తులతో ప్రదోష పూజలు నిర్వహించారు. నందీశ్వరుడు, వాల్మీకేశ్వరస్వామికి ఏక కాలంలో పూజలు చేశారు. ఈ పూజలకు ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఆలయ చైర్మన్ ఏవీఎం మునిచంద్రశేఖర్ రెడ్డి, కార్యనిర్వహణాధికారి రామచంద్రారెడ్డి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

శ్రీకాళహస్తి: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా మనిషి సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సీడీపీఓ శాంతిదుర్గ అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మండలంలోని తొండమనాడు సెక్టార్ పరిధిలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార ప్రాధాన్యతపై గర్భవతులు, బాలింతలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ రేవతి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలే కాకుండా పిల్లలు కూడా పౌష్టికాహారం తీసుకునేలా కార్యకర్తలు వారిని ప్రోత్సహించాలని సూచించారు. పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రదర్శన

సత్యవేడు అభ్యర్థిని మార్చకుంటే ఓటమి తప్పదు

తిరుపతి కల్చరల్: గతంలో టీడీపీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేసిన ఆదిమూలంను సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేయడం దుర్మార్గమని, అతని అభ్యర్థిత్వాన్ని మార్చకుంటే సత్యవేడులో టీడీపీకి ఓటమి తప్పదని ఆ నియోజకవర్గ టీడీపీ నేతలు టీడీపీ అధినేత చంద్రబాబుకు హెచ్చరిక చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాగలాపురం క్లస్టర్ టీడీపీ ఇన్‌చార్జ్ ఎండీ.కుమార్, టీడీపీ యువజన విభాగం ఉపాధ్యక్షుడు కె.తిరుపతి మాట్లాడుతూ సత్యవేడు టీడీపీ అభ్యర్థి ఆదిమూలం పట్ల వారు వ్యతిరేకతను వ్యక్తం చేశారు. టీడీపీని బతికించుకునేందుకు క్షేత్రస్థాయి నుంచి గత ఐదేళ్లుగా నిరంతరం తాము పోరాడుతూ అష్టకష్టాల పాలయ్యామని వాపోయారు. ఇదే స్థాయిలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే హేమలత సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా శ్రమిస్తూ యువతను సైతం చైతన్యవంతులను చేస్తూ పార్టీ ప్రతిష్టను నిలిపేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించే హేమలతకు సీటు కేటాయిస్తే సత్యవేడులో టీడీపీ గెలుపు తథ్యమని స్పష్టం చేశారు. అయితే టీడీపీ అధినాయకులు చంద్రబాబు నాయుడు, లోకేష్, అచ్చెన్నాయుడు ఇప్పటికైనా మనసు మార్చుకోవాలన్నారు. గతంలో టీడీపీకి వ్యతిరేకంగా వ్యవహరించడంతో పాటు పార్టీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేసిన ఆదిమూలంకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వడంతో నియోజకవర్గంలో పార్టీ నేతలు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. అతనే అభ్యర్థి అయితే మాత్రం సత్యవేడులో టీడీపీ ఓడిపోవడం ఖాయమన్నారు. ఇప్పటికైనా స్పందించి సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వారితో పాటు టీడీపీ బూత్ కమిటీ ఇన్‌చార్జ్‌లు బాబు, దేవ, మునివేల్, మహేష్, సామరాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యవేడు టీడీపీ యువజన విభాగం ఉపాధ్యక్షుడు తిరుపతి